

# మంచి కవితతో కొంచెంసేపు

విన్నకోట రవిశంకర్



## నెలనెలా ఒక మంచి కవితాపరిచయం

## మృత్యువుతో తొలి పరిచయం




కావ్యాలు, ప్రబంధాలవంటి సాంప్రదాయ సాహిత్యంలో ఎక్కడ చూసినా కథ, కవిత్వమూ కలిసే ఉంటాయి. వాటిలో కవిత్వానికవసరమైన అలంకారాలతో బాటు కవి పాత్రల్ని, సంఘటనల్ని సృష్టించటం, ఆయా సంఘటనలకి వివిధ వ్యక్తుల స్పందనల్ని వర్ణించటం తరచు చెయ్యవలసి వస్తుంది. ఆధునికకాలంలో కథ, కవిత్వమూ వేరుపడ్డాక, మన కవులు, మరీ ముఖ్యంగా వచన కవిత్వం రాసే కవులు వాటి మధ్య అంతరాన్ని విధిగా పాటిస్తూ వచ్చారనే చెప్పాలి. రావిశాస్త్రి వంటి కొద్దిమంది రచయితల కథల్లో కవితాత్మకమైన వర్ణలు చోటుచేసుకున్న సందర్భాలనేకం ఉన్నా, కవులు రాసే ఖండికల్లో కథతో కూడిన వస్తువు తీసుకున్న సందర్భాలు మాత్రం చాలా తక్కువ. దీనివల్ల కవిత్వంలో గాఢత పెంపొందే అవకాశం పెరిగిన మాట నిజమే అయినా, కల్పనకు సంబంధించి ఒక భాగాన్ని కవి వదులుకున్నట్టవుతుంది. ప్రతిభావంతుడైన కవి కథతో కూడిన వస్తువుని ఎంచుకున్నా, మంచి కవిత చెప్పగలుగుతాడు. కవి, కథకుడు కూడా అయిన చంద్ర కన్నెగంటి కవితాసంకలనం "వాన వెలిసిన సాయంత్రం" లో ఇటువంటి కవితలు కొన్ని ఉన్నాయి. ప్రస్తుతం పరిశీలిస్తున్న కవిత "మృత్యువుతో తొలి పరిచయం" వాటిలో ఒకటి.

వచన కవితలో మరీ కథాకావ్యాలు రాయవలసిన అవసరం లేదుగాని, చిన్న ఖండికల్లోనే ఒక సంఘటనని గుర్తించటం, దానిని పరిమితమైన వాక్యాలలో ఆకట్టుకొనే విధంగా వర్ణించే ప్రయత్నం చెయ్యటం మంచిదే అసలు ఒక సంఘటనని గుర్తించటంలోనే కవి తాత్విక దృష్టి, చేతనా సౌకుమార్యం మనకు తెలుస్తాయి. ఒక సున్నితమైన అంశాన్ని తీసుకున్నప్పుడు, అందుకు తగినట్టుగా దానిని నిర్వహించటం కవికి చాలా ముఖ్యం. పిల్లలు, మృత్యువు - ఈ రెండూ సున్నితమైన అంశాలే. పిల్లలకి మృత్యువుతో కలిగిన తొలిపరిచయాన్ని వస్తువుగా ఎంచుకోవటం, దానిని మరింత సున్నితంగా నిర్వహించటం వల్ల ఇది మంచి కవితగా రూపొందింది.

కథతో కూడిన కవితలో మిరుమిట్లు గొలిపే పదచిత్రాలు నిర్మించటానికి అవకాశం ఉండకపోవచ్చు. ఒక సంఘటనని వర్ణించేటప్పుడు కవిత ఎక్కడ మొదలుపెట్టబడి, ఎంతవరకు కొనసాగి, ఎలా ముగింపబడిందనే విషయం ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. ఐతే,

ఈ సంకలనంలో ఉన్న ఇతర కవితలలో పదచిత్రాల కల్పనకి, ఊహా వైచిత్రికి కొదవలేదు. వసంతం వచ్చినప్పుడు మంచు మళ్ళీ ఏడురంగులుగా విడిపోతుందని, వాన వెలిసిన ఊరు తలారా స్నానం చేసి ఎండ తువ్వాలు వెతుక్కుంటున్నట్లుంటుందని, చెరువుగట్టు మీద చెట్టు ఒంగి కడవతో నీళ్ళు ముంచుకుంటూ నీళ్ళల్లో నీడ చూసుకొనే పడుచులా ఉంటుందని చెప్పే లాంటి అందమైన పదచిత్రాలు అనేక కవితల్లో మనకు ఎదురౌతాయి. వాటికంటె భిన్నమైన ఈ కవిత, దీనిలో మానవీయత, ఆశ్చర్యం, జాలి, దుఃఖం, ఆశ వంటి విభిన్నమైన భావాలు కలగలిసినకారణంచేత, నిరలంకారంగా ఉంటూనే మనసుని హత్తుకుంటుంది.

ఈ కవితలో ఒక గాయపడిన పక్షి చుట్టూ పిల్లలు గుమిగూడటం, దానికి సపర్యలు చేసి కాపాడే ప్రయత్నం చెయ్యటం పిల్లల్లో సహజంగా ఉండే ఉత్సుకత, కరుణ వంటి గుణాల్ని తెలియజేస్తుంది. తరువాత, అది మరణిస్తే, వాళ్ళంతా ఏడవటం, ఒక గుంట తవ్వి దానిని పూడ్చిపెట్టటం వారిలో ఉండే సానుభూతిని, చిన్న చిన్న ప్రాణులపట్ల వారికుండే ప్రేమని చూపిస్తుంది. కొన్ని రోజులకి పక్షిని పాతిపెట్టిన చోట మొలిచిన మొక్క గురించి చెబుతూ కవితను ముగించటంవల్ల, మృత్యువు ఒక ముగింపు కాదని, జీవం వివిధ రూపాలలో కొనసాగుతూనే ఉంటుందని సూచించినట్టయింది. దీనివల్ల కవితకు ఒక తాత్వికమైన లోతు ఏర్పడింది. పక్షి స్థానంలో మొలకెత్తిన మొక్క "రెండాకులు రెక్కల్లా రెపరెపలాడుతూ" ఉందని చెప్పిన పోలిక ఎంతో సముచితమైనది.

ఈ కవిత నిర్మాణం గురించి కూడా ఒక మాట చెప్పుకోవాలి. వచన కవితను పంక్తులుగా విడగొట్టటంలో వివిధ వ్యూహాలు కవులు పాటిస్తూ ఉంటారు. పూర్తిగా కథతో కూడిన కవితను అలా పంక్తులుగా విడగొట్టవలసిన అవసరం లేదు. అందుకే ఈ కవితలో కేవలం కొన్ని చుక్కలతో వాక్యాలను వేరుచేస్తూ అంతా ఒక పేరాగ్రాఫులాగా కూర్చటం సరైన పద్ధతేననిపిస్తుంది.

తెలుగులో అంతగా లేకపోయినా, కథతో కూడిన కవితల సంఖ్య ఇతర భాషల్లో ఎంతవరకూ ఉంటుందనేది ఆసక్తికరమైన ప్రశ్న. సమకాలీన అమెరికన్ కవిత్వాన్ని పరిశీలించినప్పుడు వాటిలో అధిక శాతం కవితల్లో కథను పోలిన సంఘటనల వర్ణనలే తరచు కనిపిస్తాయి. ఇవన్నీ మంచి కవితలే అని చెప్పలేం. అన్నిటిలాగే వీటిలోనూ మంచీ, చెడ్డా ఉంటాయి. అయినప్పటికీ, కథాంశం కలిగిన అటువంటి కవితల్ని కూడా ప్రయత్నించటం, వాటిని ప్రతిభావంతంగా నిర్వహించటం అభిలషణీయం. అటువంటి ఒక సఫల ప్రయత్నానికి ఉదాహరణ ఈ కవిత.

<u>కవిత పూర్తి పాఠం:</u>

ఆటల్లో మునిగినా ఎట్లా గమనించారో, ఎవరు ముందుగా
చూశారో తెలియదు, పిల్లలంతా గుమిగూడారు దాని చుట్టూ...
వాళ్ళ కేకలు, చిందులూ చిటికెలో వదిలేసి ... ఎంత ఎగరాలని
చూస్తున్నా ఎగరలేకపోతోందది.... జబ్బో... ఆకలిదప్పులో దాని
సత్తువంతా లాగేశాయి... ఎంత చిన్న పిట్ట.. లేత, ముదురు
గోధుమరంగుల్లో...చిన్నదో పెద్దదో తెలియదు వయసులో ...
ఏ దూరదేశాల పయనంలో ఏ గాలి మోసం చేసిందో, లేక ఈ
చుట్టుపక్కల ఏ గూటినుంచి జారిపడిందో తెలియదు... పిల్లల
ప్పటికే ఎంతో దయతో దాన్ని చేరదీశారు..రెక్కల్లాంటి తమ

మెత్తటి వెచ్చటి అరిచేతులతో...హడావుడిగా నీళ్ళూ,గింజలూ
పరిగెత్తుకొచ్చాయి...ఒక డబ్బా దానికి గూడయింది...దాంట్లో
దానికి పచ్చిక పడక ఏర్పాటయింది...ఈ మధ్యలో దాని
ఆయువు ఎప్పుడో ఎగిరిపోయింది. అది తెలిసీ తెలియగానే
పిల్లలంతా గొల్లుమన్నారు...వలవల ఏడుపులు..ధారలుగా
కన్నీళ్ళు...అప్పటికప్పుడే దానికో పేరు...ఫాల్కో ఒక గుంట
తవ్వి దాన్ని పూడ్చి పెట్టారు...అర్థాకలి, ఆరిపోయిన కన్నీటి
చారికలే మిగిలాయా పూటకి...ఇంకెన్ని మరణాలకు సరిపోను
మిగుల్చుకున్నారో కన్నీరు మరి!

పాతిపెట్టిన తావునే ఇవాళ ఓ మొక్క మొలిచింది.. రెండా
కులు రెక్కల్లా రెపరెపలాడుతూ..ఎగరలేకపోయినా..ఎగరాలని
ప్రయత్నిస్తూనో..పైనపోయే పిట్టల్ని రారమ్మని పిలుస్తూనో...
పిల్లలకెంత సంబరమో మొక్కను చూసి!

-చంద్ర కన్నెగంటి

*(కవి కథకుడు అయిన చంద్ర కన్నెగంటి వివిధ పత్రికలలో అనేక కథలు, కవితలు రాసారు. "వాన వెలిసిన సాయంత్రం" అనే కవితాసంకలనం వెలువరించారు. ఒక కథా సంకలనాన్ని కూడా తీసుకువచ్చే ప్రయత్నంలో ఉన్నారు. అమెరికాలోని టెక్సస్ రాష్ట్రంలో నివాసం)*